www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 2 ఆగస్టు 2024
5
చిత్తూరు

స్టాండింగ్ కమిటీ ఎన్నిక రసాభస

- వైసిపి కార్పొరేటర్లు బాయ్‌కాట్.. • కలెక్టర్‌కు ఫిర్యాదు

కార్పొరేటర్లతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విజయానందరెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక రసాభసగా మారింది. నగర కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ వైసిపి కార్పొరేటర్లు డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ నేతృత్వంలో ఎన్నికను బాయ్‌కాట్ చేశారు. నగర కమిషనర్ తీరును నిరసిస్తూ నగరపాలక కార్యాలయం ఎదుట వైసిపి చిత్తూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి, కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకపక్షంగా అధికార తెలుగుదేశం కూటమికి అనుకూలంగా కమిషనర్ పోలింగ్ అధికారులు వ్యవహరించారంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకుపోనున్నట్లు విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ తెలిపారు. 50 మంది సభ్యులున్న నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీకి ఐదుగురు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నుకోవాలి. నగర కమిషనర్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. వైసిపి అశోక్, చంద్రశేఖర్, నిర్మల, మధుబాబు, రాజేష్ కుమార్‌రెడ్డి, శశికుమార్, శోభ, సుప్ప స్టాండింగ్ కమిటీ సభ్యులుగా పోటీ చేసేందుకు నామినేషన్ వేశారు. గురువారం పోలింగ్ ప్రారంభం కాగానే వైసిపి కార్పొరేటర్ డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ పోలింగ్ స్లిప్పులు కౌటింగ్ హాలులోనే ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో గందరగోళం నెలకొంది. పోలింగ్ స్లిప్పులు సీరియల్ ఒకటి నుండి కాకుండా 32 నుండి పంపిణీ చేయడంతో కమిషన్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైసిపి కార్పొరేటర్లు ఎన్నికల నిర్వహణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ ఎన్నికలను బాయ్‌కాట్ చేశారు. వైసిపి సభ్యులు బాయ్‌కాట్ చేసిన ఒట్టు వేసేందుకు ముందుకు వచ్చిన కార్పొరేటర్లతో పోలింగ్ నిర్వహించి వైసిపి నుంచి టిడిపిలో చేరిన డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, శశికుమార్, నిర్మల, అశోక్, షప్ప స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు పోలింగ్ అధికారులు ప్రకటించారు.

నిరసన తెలుపుతున్న వైసిపి కార్పొరేటర్లు

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రిజిస్టర్ ఆఫీసుల్లో భద్రతెంత..?

- కార్యాలయాలను పరిశీలించి వెంటనే నివేదికివ్వండి
- ఆర్‌అండ్‌బి, విద్యుత్, అగ్నిమాపక శాఖలకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలోని 8 రిజిస్ట్రేషన్ కార్యాలయాల భద్రతా ప్రమాణాలను పరిశీలించి నివేదికివ్వాలని ఆర్‌అండ్‌బి, విద్యుత్, అగ్నిమాపక శాఖలను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చిత్తూరు, చిత్తూరు రూరల్, బంగారుపాళెం, కుప్పం, నగరి, పలమనేరు, పుంగనూరు, కార్వేటినగరంలలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యాలయ భవనాల తాజా పరిస్థితిని, విద్యుత్ సంఫరా, కార్యాలయాల్లో ఉన్న డాక్యుమెంట్ల భద్రత, నూతన భవనాల ఆవశ్యకత, స్థలం కేటాయింపు, తదితర అంశాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, విద్యుత్ శాఖ ఈఈ శ్రీహరి, ఆర్‌అండ్‌బి డిప్యూటీ ఈఈ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

కంది పప్పు లేనట్టేనా.!

- చక్కెరదీ అదే పరిస్థితి..
- ఎండియుల కొనసాగింపుపై సందిగ్ధత

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ ఏ సరుకు ఏ నెల అందుతుందో తెలీని పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డుదారులకు ఏడాదికి పైగా రాయితీ కందిపప్పు పంపిణీ నిలిచిపోయింది. రెండు నెలలుగా చక్కెర ఇవ్వడం లేదు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఆగస్టు నుంచి బియ్యం, కందిపప్పు, పంచదార సరుకులను అందించాలని నిర్ణయించిన టెండర్ల ప్రక్రియలో జాప్యం కావడంతో ఈసారి అన్ని సరుకులూ అందే పరిస్థితి కనిపించడం లేదు. అర్బన్‌లో బియ్యంతో పాటు రాగులు, గోధుమపిండి ఇవ్వమన్నారు. రూరల్ ప్రాంతాల్లో కేవలం బియ్యం మాత్రమే అందించనున్నారు. సరుకుల పంపిణీపై జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులకు ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2488 రేషన్ షాపులు ఉన్నాయి. 12 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. సుమారు 638 ఎండియు వాహనాలు ఉన్నాయి. బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర అందిస్తారని అంతా భావించినా జిల్లాకు సరుకులు కాలేదు. పౌరసరఫరాలసంస్థ రాష్ట్ర ఉన్నతాధికారులు టెండర్లను ఆహ్వానించినా సకాలంలో పూర్తి కాలేదని తెలుస్తోంది. దీంతో ఎప్పటిలాగానే కార్డులో ఎంతమంది సభ్యులు ఉంటే అన్ని కేజీల బియ్యం ఇవ్వనున్నారు. అర్బన్ ప్రాంతంలో మాత్రం బియ్యంతో పాటు రాగులు, గోధుమపిండి ఇవ్వనున్నారు.

ఎండియుల కొనసాగింపుపై సందిగ్ధత..

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేసేందుకు మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (ఎండియు) వ్యవస్థను 2021, ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. రేషన్ డోర్ డెలివరీ కోసం ప్రభుత్వం రూ.5.83లక్షల విలువైన వాహనాలను అందించింది. వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేందుకు జిల్లాలో 422 మంది ఆపరేట్లను నియమించారు. డోర్ డెలివరీ చేసే ఆపరేటర్లు తొలుత ప్రభుత్వం రూ.16వేలు వేతనంగా నిర్ణయించింది. వాహనాలకు డ్రైవర్లుగా మాత్రమే పనిచేయాల్సి ఉంటుందని చెప్పిన ప్రభుత్వం తర్వాత వారితో తూకం ఈ-పాస్ మిషన్లో వివరాలు నమోదు తదితర పనులు అప్పగించింది. దీంతో తమకు ఇస్తున్న వేతనం చాలదని అప్పట్లో వారు ఆందోళనకు దిగడంతో వేతనాన్ని రూ.21వేలకు పెంచింది. రేషన్ వాహనానికి సమకూర్చిన రుణానికి వాయిదా సొమ్ముగా రూ.3వేలను జమ చేసుకుంటోంది. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఈ వ్యవస్థను రద్దు చేసి పాత పద్ధతిలోనే రేషన్ దుకాణాల ద్వారా సరుకులను అందిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇప్పటికిప్పుడే దీన్ని రద్దు చేసే అవకాశం ఉండకపోవచ్చు అని అధికారులు భావిస్తున్నారు. ఎండియు వ్యవస్థ నిర్వహణకు గతంలోనే బడ్జెట్ కేటాయింపులు చేసిన నేపథ్యంలో వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగించవచ్చు అనే అంచనా ఉంది. అదేవిధంగా బియ్యం మూడు కేజీలను తగ్గించి దాని స్థానంలో రాగులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రతి కార్డుపై కేజీ కందిపప్పు..

ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా పంపిణీ నిలిచిపోవడంతో కందిపప్పు ధరలు క్రమేణా పెరుగుతున్నాయి. ఎండియు వాహనాల ద్వారా గతంలో రాయితీపై ప్రభుత్వం కేజీ రూ.67లకే కందిపప్పు అందించేది. ఇప్పుడు పంపిణీ చేయకపోవడంతో మార్కెట్లో కందిపప్పు ధర అంతకంతకూ పెరిగిపోయింది. ప్రస్తుతం కందిపప్పు కేజీ ధర రూ.180 నుంచి 200లకు చేరింది. ఇక చక్కెర పరిస్థితీ అలానే ఉంది. రాయితీపై కేజీ పంచదార రూ.17లకే పేదలకు ఇవ్వాల్సి ఉంది.. ఇప్పుడు మార్కెట్లో రూ.24కు పెరిగి రూ.41కి చేరింది.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం..

- "డయల్ యువర్ ఎమ్మెల్యే"లో గురజాల

ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే, కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రజల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ప్రతి గురువారం "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలను సావధానంగా విన్నారు. వచ్చిన ఫిర్యాదులు, వినతులను వంద శాతం పరిష్కరించేలా అధికారులు చర్యలు ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. గత వారంలో అందిన 48 ఫిర్యాదులకు గాను 27 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. గురువారం "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమంలో మొత్తం 45 ఫిర్యాదులు, వినతులు అందాయి. కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ జె.అరుణ, మేయర్ అముద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే ఆస్తి

- బాల్యం అమూల్యమైనది
- విద్యార్థుల వైద్య శిబిరంలో ఎస్పి మణికంఠ చందోలు

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యమే ఆస్తి అని ఎస్పి మణికంఠ చందోలు అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులు ఉండేందుకు అవగాహన పెంచుకోవాలన్నారు. చిన్నారులకు బాల్యం ఎంతో అమూల్యమైనదని ఆయన అన్నారు. గురువారం చిత్తూరు సాయిడి దళం కార్యాలయం వద్ద సుస్మా అపోలో ఆసుపత్రుల సహకారంతో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న పోలీసు, ప్రభుత్వ కార్యాలయ విద్యార్థులకు ఎస్పీ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 200మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో ముఖ్యంగా పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, గైనిక్, ఈఎన్‌టి పరీక్షలు చేపట్టారు. ఎస్పి మాట్లాడుతూ పిల్లలతో మమేకమై, వారి ఆహారపు అలవాట్లు తెలుసుకొని, వారికి ఆరోగ్యకరమైన శరీరం కోసం ఆహారపు అలవాట్లు గురించి తెలియజేస్తూ ఆరోగ్యం కోసం సక్రమమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యమని సూచించారు. సుస్మ హాస్పిటల్ డాక్టర్ మురళీకృష్ణ, అపోలో హాస్పిటల్ మెడికల్ అడ్మినిస్ట్రేటర్ రాంగోపాల్ రెడ్డి కార్యక్రమంలో ముఖ్యపాత్ర పోషించారు. శిబిరాన్ని ఘన విజయం చేసిన పోలీసు అధికారులకు, సిబ్బంది, డాక్టర్లకు ఎస్పీ కృతజ్ఞతలు తెలుపుతూ జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు అరిఫుల్లా, నాగేశ్వర రావు, సుబ్బరాజు, ఆర్‌ఐ భాస్కర్, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ లావణ్య, జీలాని, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ భరత్‌కు నిరసన సెగ..!

- గతమంతా టీడీపీ నేతలు, ప్రజలు భయాందోళనలో గడిపాం..
- వైసీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ భరత్‌పై టీడీపీ నేతల ధ్వజం
- రామకుప్పం పర్యటనకు వచ్చిన ఆయనను అడ్డగింత
- వ్యతిరేకంగా 'గో బ్యాక్ భరత్' అంటూ నినాదాలు
- పోలీసుల జోక్యంతో అక్కడి నుంచి వెనుతిరిగిన ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ భరత్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ శ్రేణులు

ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పంకు వచ్చిన వైసీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ భరత్‌ను గురువారం టీడీపీ శ్రేణులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. కుప్పం నియోజకవర్గంలో పలు మండలాల్లోని వైసీపీ ఎంపీటీసీలు టీడీపీలో చేరడంతో ఎమ్మెల్సీ భరత్ నష్టనివారణ చర్యలకు శ్రీకారం చుట్టారు. గురువారం ఉదయం ఆయన రామకుప్పం పట్టణ శివార్లలోని ఆకందానది పల్లెలోని వైసీపీ నేత చంద్రారెడ్డి గెస్ట్‌హౌస్‌లో మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు అధికసంఖ్యలో భరత్‌ను అడ్డుకునేందుకు వైసీపీకి వ్యతిరేకంగా, భరత్ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్సీ భరత్‌కి తమ సమస్యలు తెలపాలని బీష్మించారు. మాజీ ముఖ్యమంత్రిగా, స్థానిక ఎమ్మెల్యేగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనకు వచ్చిన ప్రతిసారీ భరత్ వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టి అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం జరిగిందన్నారు. అటువంటి వ్యక్తి కుప్పంలో ఎలా పర్యటిస్తారని వారు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కుప్పం సీఐ మల్లేష్ యాదవ్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని టీడీపీ శ్రేణులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కానీ టిడిపి శ్రేణులు సమావేశం జరుగుతున్న గెస్ట్‌హౌస్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయడంతో వారిని సీఐ నిలువరించి డిమాండ్లను తెలిపితే, తాము విషయాన్ని భరత్‌కు చెబుతానని వారికి సర్ది చెప్పారు. కుప్పంలో ప్రతీకార, అరాచక పరిస్థితులు కల్పించి టీడీపీ శ్రేణులు, ప్రజలు భయంతో కాలం గడిపేలా చేసిన భరత్ నియోజకవర్గంలో ఎక్కడా పర్యటించరాదని అన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో ఆయన ఎక్కడ పర్యటించినా తాము అడ్డుకుంటామని హెచ్చరించారు. దీంతో పోలీసులు భరత్‌ను విజలాపురం రోడ్డు గుండా కుప్పంకు వెళ్లేలా చూశారు. దీంతో టీడీపీ శ్రేణులు అక్కడి నుంచి నిష్క్రమించారు.

కుప్పంలో పర్యటించే అర్హత ఎమ్మెల్సీ భరత్‌కు లేదు: టీడీపీ

ప్రశాంతంగా ఉన్న కుప్పం ప్రాంతంలో భద్రత్ర అధికారం అడ్డుపెట్టుకుని అరాచకాలను సృష్టించిన ఎమ్మెల్సీ భరత్ కుప్పం నియోజకవర్గంలో పర్యటించే అర్హత లేదని టిడిపి రామకుప్పం మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు పేర్కొన్నారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో భరత్ ఆధ్వర్యంలో అడుగడుగునా అరాచకం రాజ్యమేలిందన్నారు. అరాచకాలను అడ్డుకున్న వందలాది మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు, సామాన్య జనంపై విచ్చలవిడిగా దాడులు నిర్వహించారు. ప్రజలు భయంతో కాలం గడిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి వేధించారన్నారు. అప్పటి మాజీ సీఎం, ప్రస్తుత సీఎం చంద్రబాబు గారిలో కుప్పం లో పర్యటించిన ప్రతి సారి వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రత్యాహారాలు, అటువంటి వ్యక్తికి నియోజకవర్గంలో పర్యటించే అర్హత లేదని అన్నారు.

పింఛన్ అడిగారని దళితులపై దాడి

- టీడీపీకి ఓటు వేయలేదనే.. • పోలీసులకు బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి-పుంగనూరు: ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయలేదన్న కారణంగా వృద్ధ దళిత మహిళలకు పింఛన్ ఆపేశారు. నిలదీసినందుకు కులంపేరుతో దూషిస్తూ దాడి చేసిన సంఘటన మండలంలోని మిట్టపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని వనమలదిన్నె పంచాయతీ మిట్టపల్లి గ్రామంలో దళిత కులానికి చెందిన చెన్నమ్మ, రామక్క, అమరక్క, మునెమ్మ, గంగమ్మ, సరస్వతిలకు పింఛన్ ఇవ్వకుండ గురువారం ఆపివేశారు. దీనిపై అందరు కలిసి పంచాయతీ కార్యదర్శిని పింఛన్ ఇవ్వాలని అధికారులను నిలదీశారు. తమ పింఛన్ ఇవ్వాలంటూ అడుగుతుండగా అదే గ్రామానికి చెందిన నాగరాజు, గిరి తదితరులు వృద్ధ మహిళలను కులం పేరుతో దూషించి, షష్టం వచ్చిన వారికి పింఛన్ ఇస్తాం.. అడగటానికి మీరెవరు..? మీరు ఓట్లు వేశారా..? అంటు దాడి చేసి కొట్టారని మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా ఓట్లు వేయలేదని, మిట్టపల్లి నుంచి నాయకుర్లపల్లి, జనివినాయునిపల్లె తదితర బీసీ కులస్తులు ఉన్న గ్రామాలకు వెళ్లే రోడ్డుకు గత నెలలో

(టంచ్ కొట్టి రాకపోకలు స్తంభింప చేశారు. ప్రస్తుతం పింఛన్ ఇవే దళితులపై దాడి చేయడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దళిత నేతల ఆగ్రహం

మిట్టపల్లిలో పింఛన్ అడిగిన దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి, దళితులకు రక్షణ కల్పించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వి అశోక్ కుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ మిట్టపల్లి గ్రామంలో దళితులను, బీసీలను తిరగనివ్వకుండ రోడ్డు అడ్డగిస్తున్నారని, పింఛన్ ఇవ్వకుండ వేధిస్తున్నారని ఆరోపించారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

- సచివాలయ తనిఖీలో డీపీవో లక్ష్మి

కందూరు సచివాలయ తనిఖీలో డీపీవో లక్ష్మి

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు, తమ్మి నాయునిపల్లి సచివాలయాన్ని డీపీవో లక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పింఛన్ల పంపిణీ, పారిశుధ్య కార్యక్రమాలు తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేగవంతంగా స్పందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డి లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు జయశంకర్, నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయండి'

ప్రజాశక్తి-రామకుప్పం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ట్రస్ట్ భవనంలో సంఘ మిత్రలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, మహిళా సంఘాలకు వారధిగా పని చేయాలని పిలుపునిచ్చారు. అమలవుతున్న ప్రతి ఒక్క పథకాన్ని ప్రజలకు చేరవేసే తద్వారా ఆర్థిక అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. అనంతరం మండల విద్యుత్ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో విద్యుత్ సమస్యలు లేకుండా అదనపు విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని చర్చించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా నత్వరమే విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, నరసింహులు, మునస్వామి, ఆంజనేయ రెడ్డి, చిన్న కృష్ణ, చలపతి, సీతాపతి, రామమూర్తి, గంట్లప్ప గౌడ, విశ్వనాథ్, బాబు, జయశంకర్ పాల్గొన్నారు.

పి(ప)ంఛన్

- జిల్లాలో 2,71,422 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు
- రూ. రూ.114.43 కోట్లు పంపిణీ
- చెర్లోపల్లిలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల చేతుల మీదుగా పంపిణీ

చిత్తూరులో

కార్వేటినగరంలో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద సామాజిక భద్రత పెన్షన్ పంపిణీలో భాగంగా 2,71,422 మందికి రూ.114.43 కోట్లు చెల్లించడం జరుగుతున్నదని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం చిత్తూరు రూరల్ పరిధి చెర్లోపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో జిల్లాలో ప్రతి నెల ఒకటవ తేదీనే పూర్తి స్థాయిలో సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ పూర్తి చేసేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం నమర్థవంతంగా అమలు చేస్తున్నదని అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో వృద్ధులు, వితంతు, వికలాంగులు, డప్పు కళాకారులు, హిజ్రాలు, చర్మకారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, తదితర వర్గాలైన 2,71,422మందికి రూ.114.43కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పెన్షన్ల ద్వారా అందించే నగదును మందులు, నిత్యావసర సరుకుల కొనుగోలు వంటివాటికి సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులను కలెక్టర్ కోరారు. చెర్లోపల్లి ప్రజల వినతి మేరకు జల్ జీవన మిషన్ క్రింద ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపడతామని, ప్రతి ఇంటికి నీటి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. నేషనల్ హైవే అధికారులతో సమీక్షించి అండర్ పాస్ మార్గాలను ఏర్పాటు చర్యలు చేపడతామన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే సామాజిక భద్రతా పెన్షన్లను పెంచి ఉత్తర్వులను ఇచ్చారని, ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు ఒక్కో నెలకు ఒక వెయ్యి రూపాయలు, జులై నెలలో రూ.4 వేలు మొత్తం రూ.7వేలు పెన్షను అందించడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించేలా ప్రభుత్వం తగువు కృషి చేస్తామన్నారు. అర్బన్ పరిధి 47వ డివిజన్ ఓబనపల్లిలో సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీని కలెక్టర్ పరిశీలించి పంపిణీ చేశారు.

స్విమ్స్ ఐసీయూలో పింఛన్ అందజేత

- మానవత్వం చాటుకున్న సచివాలయం ఉద్యోగి

ప్రజాశక్తి-వెదురుకుప్పం, ఎన్ఆర్ పురం, గంగాధర నెల్లూరు: మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన ఎస్టీ రుని భాస్కర్‌రెడ్డి అనారోగ్య కారణంతో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆయనకి పెరుమాళ్ళపల్లి సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ పుష్ప గురువారం ఆస్పత్రికి వెళ్లి భాస్కర్ రెడ్డి భార్యకి పింఛన్ అందించారు. ఈమె బాధ్యతగా పింఛన్ అందజేయడం పట్ల పలువురు అభినందించారు. అదేవిధంగా మండలంలోని గంటావారిపల్లిలో సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ లబ్దిదారులకు నగదు పంపిణీ చేశారు. ఎస్ఆర్ పురం మండలంలోని కొత్తపల్లిమిట్టలో ఎమ్మెల్యే థామస్ చేతుల మీదుగా పింఛన్ పంపిణీ జరిగింది. టీడీపీ నేత గంధమనేని జయశంకర్‌నాయుడు, పలువురు పాల్గొన్నారు. కార్వేటినగరం మండలంలోని కొల్లగుంట గ్రామంలో పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే థామస్ పాల్గొన్నారు. జీడీ నెల్లూరు మండలంలోని తూగుండ్రం వద్ద ఏర్పాటు చేసిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నాయకులు పొన్న యుగంధర్, చిట్టిబాబునాయుడు, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో..

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని టేకుమంద సచివాలయంలో పరిధిలో గల పెన్షన్ దారులు అనారోగ్యంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెన్షన్ దారులకు సచివాలయ సిబ్బంది పింఛన్లను పంపిణీ చేశారు.

తిరుపతి స్విమ్స్‌లో

అంగన్వాడీలకు మెనూ భారం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నిత్యవసర సరుకుల ఆకాశాన్ని అంటుతున్నా అంగన్వాడీలో పోషకాహార మెనూ పెంచకపోవడంతో సెంటర్ల నిర్వహణ పోషకాన్ని అందించేవడం అంగన్వాడీలు నానా అవస్థలు పడాల్సివస్తోంది. మార్కెట్లో కూరగాయల ధరలు పెరిగాయి. ఐదు వందల ఖర్చు చేసినా వారానికి సరిపడ కూరగాయలు వచ్చే పరిస్థితి లేదు. స్త్రీ శిశు సంక్షేమశాఖ చౌక బియ్యం, వంటనూనె, కంది పప్పు సరఫరా చేస్తున్నప్పటికీ పెరిగిన ధరలతో కూరగాయలు కొనుగోలు చేసి మెను ప్రకారం అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు భోజనం అందించడం తలకుమించిన భారంగా మారింది. బలగాలపొడు ప్రాజెక్టు పరిధిలోని కార్యాలయాల సెక్టార్లలో గత మూడు నెలలుగా కందిపప్పు సరఫరా కాకపోవడంతో స్వంత డబ్బులతో కందిపప్పు కొనుగోలు చేయాల్సి వస్తోందని అక్కడి అంగన్వాడీలు వాపోతున్నారు. మరో వైపు అంగన్వాడీ సెంటర్లకు కుర్చీలు, పోరకలు, ఫినాయల్ వంటివి సరఫరా చేయడంతో సీడీపీఓ చేతివాటం ప్రదర్శిస్తున్నారని విమర్శలున్నాయి. నాశిరకం కొనుగోలు చేసి అధిక బిల్లులు పెట్టి సొమ్ము చేసుకుంటున్నారని అంగన్వాడీలో ఆరోపిస్తున్నారు. అంతమాత్రంగా ఉన్న జీతాలపై అంగన్వాడీలకు నిర్వహణ భారం పడుతోందంటున్నారు.

పెరిగిన ఖర్చులు

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం అందించేలా ప్రభుత్వ మెనూ ప్రకారం ఆకుకూరలు, కూరగాయలు, ఇతర సామగ్రిని రోజువారి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మార్కెట్ అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగడం, కూరగాయల ధరలు అమాతంగా పెరిగిపోవడంతో ప్రభుత్వం ఇస్తున్న నిధులు ఏమాత్రం సరిపోవడం లేదు. స్త్రీ శిశు సంక్షేమశాఖ మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలో ఒక్కొక్కరికి బియ్యం, 75 గ్రాములు, కందిపప్పు 15 గ్రాములు, వంట నూనె 5 గ్రాములు ఇస్తున్నారు. కూరగాయలు, పోపు సామాను వంటకు అవసరమయ్యే ఇతర వంట వస్తువులు అంగన్వాడీలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇందు కోసం ఒక్కొక్కరికి రూ. 1.58 పైసలు వంతున అందిస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలంటూ అంగన్వాడీ యూనియన్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. గ్యాస్ సిలిండర్ కోసం రూ. 900 ఖర్చు చేస్తుంటే ఒక్కోటికి రూ. 50 పైసలు చెల్లిస్తే ఎలా సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెనూ చార్జీలు పెంచాలి

ప్రస్తుతం ఉన్న మెనూలో మార్పులు చేయడంతో పాటు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని సుదీర్ఘకాలంగా కోరుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సరుకులతో మెనూ ప్రకారం పిల్లలకు పోషకాహారం అందించడం భారంగా మారుతోంది. నాణ్యమైన సరుకుల నిర్వహణకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించాలని అంగన్వాడీలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ కేంద్రాలకు జీతాలు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని పనిచేస్తుండడంతో పాటు జీతాలు పెంపు, అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని అంగన్వాడీలు కోరుతున్నారు.

బాలలు పనిలో కాదు.. బడిలో ఉండాలి

ప్రజాశక్తి-సోమల: బాలలు పనిలో కాకుండా బడిలో ఉండి పాఠాలు నేర్చుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని చైల్డ్ లేబర్ ఆఫీసర్ మధుబాబు అన్నారు. గురువారం సోమలలోని పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు 15సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం అని అలా ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ హరిత, బాల చంద్రయ్య పోలీస్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 అధికారిని నాగమణి, సూపర్వైజర్ అరుణ, డిసిపియు సోషల్ వర్కర్ మురళి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని శ్రీహరిపు రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న దొమ్మరాజు వెంకమరాజు విద్యా సామగ్రిని వితరణ చేశారు. గురువారం పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్సిల్స్ ను వితరణ గా అందించారు. హెచ్ఎం జ్ఞాన ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న వెంకమ రాజును అభినందించారు. కార్య క్రమంలో నె హ్రూ యువజన సేవా సంఘం అధ్య క్షురాలు జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు విజయ చంద్రిక, సునీత, రాధాకుమారి, వెంకటేశు, గోపి, విజయకుమార్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

పార్య పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-సోమల: సోమలలోని శ్రీ కొల్లా వెంకటరమనాయుడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం విద్యాశాఖ అందజేసిన పాఠ్య పుస్తకాలను, బ్యాగులను కొల్లా కోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కళాశాల విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న తిథి భోజనం

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలంలోని పంచాయతీ అరగొండ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్థానిక టిడిపి నాయకులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ మేరకు పైమాగంకి చెందిన టిడిపి నాయకులు రఘుపతి తన సొంత నిధులతో పంచాయతీ పరిధిలోని అరగొండ బాలుర, బాలికోన్నత పాఠశాల, అరగొండ, బీసీ కాలనీ, చారాల, నల్లపరెడ్డిపల్లి, పైమాగం ప్రాథమిక పాఠశాలలు అంగన్వాడి కేంద్రాల్లో చదివే విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘుపతి దంపతులు కోడిగుడ్డు, పాయసం, అరటిపండ్లును విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రంజిత్, వంశీ, శ్రీనివాసులు, చంద్ర, హరి, మోహన్, బాలచంద్రలతో పాటు ఆయా పాఠశాల హెచ్ ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని 89 పెద్దూరు గ్రామపంచాయితీ సర్పంచ్ మల్లిక ప్రజలకు అందుబాటులో లేదని కలెక్టర్ ఆదేశాలు మేరకు డిపిఆర్ఓ లక్ష్మి చెక్కుపవర్ రద్దుచేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జూన్ 4వ తేదీ నుంచి సర్పంచ్ మల్లిక అందుబాటులో లేదని, గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు తదితర పనులకు అందుబాటులో లేదని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డిపిఆర్ఓ పంచాయతీ సర్పంచ్ చెక్కు పవర్‌ను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. బ్యాంకు అధికారులకు 15వ ఆర్థిక నిధులను నిలుపుదల చేసి కలెక్టర్ జారీచేసిన చెక్కులను మాత్రమే అనుమతించాలని పేర్కొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పలమనేరు: రూరల్ మండలంలోని ఎం పీ కోటూరు యానాది కాలనీలో గురువారం జిల్లా న్యాయ సాధికారిక సేవా సంస్థ గిరిజన సహకార సంస్థ, చిల్డ్రన్స్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో ఉచిత మెగా చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. గిరిజన సహకార సంస్థ అధికారి మూర్తి మాట్లాడుతూ యానాదులు పౌష్టిక ఆహార లోపం వలన ఇమోగ్లోబిన్ అనారోగ్యానికి గురి అవుతున్నాన్నారు. దీని వలన మరణానికి చాలా దగ్గరగా చేరువవుతున్నారని 2047 సంవత్సరం ఇలాంటి పరిస్థితులు ఉండకూడదని కేంద్ర ప్రభుత్వం, సుప్రంకోర్టు ఉమ్మడిగా ఆలోచన చేసి ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో కొలమాసనపల్లి ఏరియా హాస్పిటల్ డాక్టర్ అన్యుహ, గిరిజన ఎంపీడీవో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్‌ల సంఘం అధ్యక్షుడిగా జయచంద్ర

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ ఎన్ఎంఆర్‌ల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్ఎంఆర్ సంఘం నూతన అధ్యక్షులుగా జి జయచంద్ర, ఉపాధ్యక్షులుగా వి జగదీష్, సెక్రటరీగా టి సిద్దయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఆ సంఘం మీడియా కోఆర్డినేటర్ దొరబాబు తెలిపారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి బోధనేతర సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు శ్రీధర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్ఎంఆర్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, ఇతర సభ్యులు కలిసి కట్టుగా టైం స్కేల్‌ను సాధించుకోవడానికి ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. బోధనేతర సంఘం తరఫున ఎల్లప్పుడూ సహాయ, సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఆర్ సంఘం నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం

- జీడిరేవుల వంకలో పంటలు పరిశీలన

ప్రజాశక్తి-సోమల: రాజస్థాన్‌కు చెందిన ఏడుగురు వ్యవసాయ పరిశీలకులు, ఆరుగురు రైతుల బృందం ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతులు, వివిధ రకాల పంట పొలాలను పరిశీలించారు. అందులో భాగంగా సోమల మండలంలోని నంజంపేట పంచాయతీ సరస్వతి పురంలో గల రామిసెట్టి మహేష్ కుమార్ లిల్లీ పూల తోటలో 22 రకాల మొక్కలు, కూరగాయల మోడల్ విధానాన్ని పరిశీలించి వాటి ఉపయోగాలు రైతు మహేష్‌ను అడిగి పొలంలో పాటిస్తున్న పద్ధతుల గురించి తెలుసుకున్నారు. ఏ గ్రేడ్, పీఎండీఎస్, ఎన్‌పిఎం షాప్, కేటిల్ షెడ్ ఉపయోగాలు తెలిపారు. ప్రధానంగా లిల్లీ పూల తోటలో ప్రధాన పంటలుగా మామిడి, మహాగని, వక్క, మునగ, జామ, బెండ, వంగ, టమాటా,మిరప, కొబ్బరి, అవిసె, అరటి, డ్రాగన్ ఫ్రూట్, ఆకు కూరలు, కంది, సోయా బీన్స్, గోధుమలు, ముల్లంగి, బీట్రూట్, క్యారెట్, వేరుశనగ పంటలతో పాటుగా ఫల వృక్షాలు అయిన అల్ల నేరేడు, సపోటా, వాటర్ ఆపిల్, కాఫీ, అవకాడో, ఆపిల్, కాఫీ, నిమ్మ, దానిమ్మ, కళింగ, లిచ్చి, పనస చెట్లు ఉన్నాయి. వీటికి ప్రతి 15 రోజులకు ఒకసారి ద్రవ జీవామృతం పిచికారి చేయడం జరుగుతుందని, చీడ పీడలు ఎక్కువగా ఉన్నపుడు కషాయం లను పిచికారి చేసి పూర్తిగా సహజ సిద్ధమైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండిస్తున్నామని మహేష్ వివరించారు. ఇందులో భూమిని సూర్య రష్మిని సమర్థవంతంగా వినియోగించుకోవడం జరుగుతున్నదని, రసాయన వ్యవసాయ పద్ధతులలో 5 ఎకరాలలో పండించే పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో 1 ఎకరలోనే పండించి అధిక ఆదాయం పొందుతున్నానని, వరి పంటలలో దేశీ రకాలైన నవారా, నారాయణ కామిని, కుళ్ళకర్, ఇంద్రాణి, కుదుపోటాలియ, మపలై సాంబ, కోశాంబరి రకాలను తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కృష్ణా రావు తీమాటిక్ లీడ్, వాసు, గురుప్రసాద్, పుష్ప, కల్పన సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



జీడీ నెల్లూరులో

సోమలలో

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం చిత్తూరు జిల్లా ప్రభుత్వం ఆసుపత్రి పీపీ యూనిట్‌లో తల్లిపాల ప్రాముఖ్యత, అవగాహనా పోస్టర్స్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ హనుమంతరావు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్ సంయుక్తంగా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంట లోనే తల్లి పాలు మొదలు పెట్టాలని, ముర్రు పాలు పట్టించాలన్నారు. ముర్రు పాలు వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి వస్తుందని, మొదటి 6నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆరు నెలలు తరువాత అదనపు ఆహారం ఇవ్వాలన్నారు. తల్లి పాలు ఇవ్వడం వలన తల్లికి రొమ్ము క్యాన్సర్, గర్భశాయ క్యాన్సర్ నుండి రక్షణ కలుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా తల్లి పాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆదేశించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అపోలో కాలేజ్ గైనిక్ హెచ్ఓడి డాక్టర్ శేషసాయి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఉష్శశ్రీ, డాక్టర్ లత, ఐసిడిఎస్ నోడల్ అధికారి జయంతి పాల్గొన్నారు.

సదుం: గురువారం సదుం మండలంలోని చెరకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చరణ్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ నీలకంఠ, జానికి, శిఖామణి, హేమలత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రషీద్, దీప, శ్రావణి, మనీషా ఆశాలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ బైరెడ్డిపల్లి పరిధిలోని 73 అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించినట్లు సిడిపిఓ మాధవి లత తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాలు 1,2లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్వైజర్ రమాదేవి, సిహెచ్ఓ అనురాధ, హెచ్ఈ సావిత్రి పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: తల్లిపాల వల్ల పిల్లలకు కలిగే లాభాలను ప్రతి ఒక్క తల్లికి వివరించాలని డాక్టర్ దుర్గాదేవి తెలిపారు. గంగాధర నెల్లూరు పిహెచ్సి నుంచి వారోత్సవ బ్యానర్‌తో ర్యాలీ నిర్వహించారు. సిహెచ్ఓ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది ధర్మేంద్ర, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల: తల్లి పాలుబిడ్డకు రోగనిరోధక శక్తి ఇస్తుందని, తల్లి పాలు శిశువుకు న్యూమోనియా, అతిసార వంటి వ్యాధుల నుండి కాపాడుతుందని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమల అంగన్వాడి కేంద్రం-1 యందు తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిహెచ్ఓ అమర్నాథ్, హెల్త్ సూపర్వైజర్ ఉషారాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ హరిత, అంగన్వాడీ కార్యకర్త సహాయకురాలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయపురం: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి విష్ణుప్రియ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన విజయపురం ఆరోగ్య కేంద్రం ఆవరణంలో తల్లిపాల వారోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

ఎంఆర్‌పీఎస్ నాయకుల సంబరాలు

ప్రజాశక్తి-రామకుప్పం: సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం రావడంతో ఎంఆర్‌పిఎస్ నేతలు సంబరాలు చేసుకున్నారు. గురువారం రామకుప్పంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి టపాకాయలు పేల్చి స్వీట్లు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చిన కూటమి నేతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్, గోవిందయ్య, సతీష్, రమేష్, జయప్ప, రామచంద్ర, శంకర, భాస్కర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సోమల: సోమల బస్టాండు కూడలిలో సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఎంఆర్‌పిఎస్ నాయకులు టపాకాయలు పేల్చి మిఠాయిలు తినిపించుకోవడం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మందారమనాదం, మండల అధ్యక్షులు ప్రభు కుమార్, ఎమ్మెస్‌వి మండల అధ్యక్షులు ప్రకాష్, నాయకులు రవికుమార్, సురేంద్రబాబు, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

రామకుప్పంలో

సదుం: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టులో అనుకూలంగా వచ్చిన తీర్పుతో సదుంలోని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు చింతపల్లి రామచంద్రయ్య, వరగాని ప్రభాకర్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తూ బాణా సంచా కాల్చారు. స్వీట్లు పంచుకొని, వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గత 30సంవత్సరాలుగా పోరాడిన న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో వెంకట్రమణయ్య, సిరి నరసింహులు, కదిరప్ప, నవీన్, హనుమంత్, నాగరాజా, నరసింహులు, జయరాం, రమణయ్య, నరసింహులు, రవి పాల్గొన్నారు.

సోమలలో

సదుంలో

పాఠశాల కమిటీలు పారదర్శకంగా ఏర్పాటు చేయాలి

- ఎంఈవోలు శ్రీరాములు, శివరత్నమ్మ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో ఈనెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను విద్యాశాఖ సూచనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని ఎంఈవోలు శ్రీరాములు, శివ రత్నమ్మ తెలిపారు. మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాల యాజమాన్య కమిటీ షెడ్యూల్ ప్రకారం ఎన్నికలను సజావుగా నిర్వహించాలని, పాఠశాల నోటీస్ బోర్డులో షెడ్యూల్ వివరాలను గోడపత్రికలో అతికించాలని తెలిపారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి పంచాయతీ కమ్మిసముద్రపల్లి గ్రామానికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సహకారంతో ఈపీఎఫ్ నిధులతో మంజూరైన సిమెంట్ రోడ్డు పనులకు గురువారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు భానుప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో కాలంగా తమ పంచాయతీ పరిధిలో సిమెంటు రోడ్డుకు నోచుకోని రోడ్ల సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సహకారంతో సిమెంట్ రోడ్లుగా మారనున్నాయని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి భాను ప్రతాప్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, గణేష్, సొన్నేపల్లి నాగరాజ యాదవ్, చందు, మునింద్ర, జగదీష్, కృష్ణ రెడ్డి, అమరనాథ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి-గుడిపల్లి: గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. గురువారం మండలంలోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్లు, తాగునీటి కల్పన, విద్యా, వైద్య సౌకర్యాలను అందించాలన్నారు. ప్రతి కుటుంబ ఆదాయ వనరులను మెరుగుపరుచుటకు చేపట్టవలసిన కార్యక్రమాలను కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. ఆ మేరకు అధికారులకు తగు సూచనలు చేశారు. అధికారులెవరూ అలసత్వం వహించకూడదని.. ప్రతి ఒక్కరు గ్రామాలు వెళ్లి పరిశీలించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే సమాజ సేవ చేయాలి: ప్రిన్సిపాల్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యార్థి దశ నుండి క్రమశిక్షణ, ఓర్పు అలవరుచుకుని ప్రజా సేవలో పాల్గొనాలని పుత్తూరు బాలికల కళాశాల ప్రిన్సిపాల్ రఘుపతి పేర్కొన్నారు. వరల్డ్ స్కార్ఫ్‌డేలో భాగంగా పుత్తూరు కామరాజు నగర్ స్కౌట్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ సెంటర్లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ వెంకటేశ్వర్లు, రేంజర్ లీడర్ భువనేశ్వరి, సుప్రియ, హేమలత గైడ్స్ లీడర్ శైలజ, రోవర్ జై కుమార్ , జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

' పరీక్ష పేపర్ల లీకేజి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇటీవల నీట్ యుజీ పరీక్ష, యుజిసి నెట్ వంటి పరీక్షలలో పరీక్ష పేపర్లను అక్రమ మార్గాల ద్వారా లీకు చేసిన లీకేజీ దారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఏబిఎస్ఆర్ఎం జాతీయ నాయకత్వం ఆధ్వర్యంలో ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రని కలిసి విజ్ఞప్తి చేశారు. పరీక్షకు ముందే పరీక్ష పేపర్లను లీక్ చేయడం ద్వారా కొన్ని లక్షల మంది కష్టపడి చదివిన తెలివైన విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరగటమే కాకుండా విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతారని , అనైతిక మార్గాల ద్వారా అవినీతి కార్యక్రమాల ద్వారా పరీక్ష పేపర్లను లీకు చేసే ముఠాలను , వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకొని సమాజం నుంచి వారిని బహిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఏబిఆర్ ఎస్ ఎం కేంద్ర విద్యా శాఖ మంత్రి కి విజ్ఞప్తి చేశారు. అవసరమైతే ప్రస్తుత చట్టాలను మార్పు చేసి పరీక్ష పేపర్ల లీకేజి దారులపై కఠిన చర్యలు చేపట్టే విధంగా కొత్త చట్టాలను తయారు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు ,డిగ్రీ కళాశాలలో, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న కొన్నివేల అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉన్నత విద్యాసంస్థలలో మౌలిక వసతులు రూపకల్పనకు ప్రయోగశాలల ఆధునీకరణకు ,విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కొరకు బడ్జెట్లో ప్రత్యేక నిధులను కేటాయించాలని, ఉన్నత విద్యాసంస్థల పరిశోధక విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ పరీక్ష పేపర్ల లీకేజి దారులను ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టబోమని కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల ద్వారా నిందితులను గుర్తించి తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఉన్నత విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి తగినంత బడ్జెట్ కేటాయిస్తామని సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ జేపీ సింఘాల్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శివానంద షిండేకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల కమిటీల ఎన్నికలకు రంగం సిద్ధం

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల పనితీరు, అభివృద్ధి, మంజూరైన నిధులు వినియోగం వంటి వాటి పర్యవేక్షణకు ఎస్ఎంసి (స్కూలు మేనేజ్ మెంటు కమిటీ) ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 8వ తేదీ మండల పరిధిలోని ప్రాథమిక, ఉన్నత, గురు కులాలలో ఎన్నికల నిర్వహణకు మండల విద్యాధికారులు మునికృష్ణయ్య, కృష్ణయ్య ఎన్నికల నోటిఫికేషన్, విధివిధానాలను విడుదల చేసి ఆయా పాఠశాలల నోటీసు బోర్డులో ప్రకటించారు. ఎన్నికల నియమావళి, నిర్వహణ వంటి ప్రక్రియపై విద్యాధికారులు మండల కేంద్రంలో శిక్షణ, అవగాహన ఏర్పాటు చేశారు. ఈ నెల 8న ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించాలని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచిం చారు. ఈ లోపు ఓటుకు అర్హులైన వారిని గుర్తించి ఓటర్ల జాబితా తయారు చేయాలని హెచ్ఎంలను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పోటీలో ఉన్న వారిని ఎన్నుకునేందుకు ఓటర్లు చేతులు పైకెత్తి సమ్మతి తెలపడం, వారి నోటి నుండి పేరును ప్రపోజ్ చేయడం వంటివి ఎన్నికల విధానంలో అవలంబించాలని తెలిపారు. ప్రతి తరగతి నుండి ముగ్గురు సభ్యులను ఎన్నుకొని ఆ సభ్యులు పాఠశాల ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎన్నుకోవాలన్నారు. రిజర్వేషన్ ప్రక్రియ విధానంలో బిసి ఓసిలో ఒకరు, ముగ్గురిలో ఇద్దరు మహిళలు ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల అధికారిగా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్ని బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. ఎక్స్ అఫీసియో సభ్యులు, కో ఆపరేటివ్ సభ్యులు సైతం ఉండేలా ఎన్నికలు సజావుగా నిర్వహించాలని, సమస్యలు, అనుమానాలు తలెత్తితే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా

- ఎమ్మెల్యే మురళి మోహన్

ప్రజాశక్తి-పూతలపట్టు: సాధారణ కూలి కుమారునికి ఎమ్మెల్యే టికెట్టు ఇచ్చి ఆదరించిన సీఎం చంద్రబాబుకి, నియోజకవర్గ ప్రజలకి రుణపడి ఉంటానని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. గురువారం ఆయన జన్మదినం సందర్భంగా పూతలపట్టు మండలంలోని గోపాల కృష్ణాపురం వద్ద పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. సుమారు 75మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, టీడీపీ నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ప్రజలు కట్టబెట్టిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు సమస్యలు పరిష్కరించడానికి ముందు ఉంటానన్నారు.

కాణిపాక వినాయకుని సేవలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ దర్శించుకున్నారు. పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం ఉదయం కుటుంబ సభ్యులు, నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో కలిసి వినాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు బిఎస్ఎన్ఎల్ మేళా

ప్రజాశక్తి- బుచ్చినాయుడుకండ్రిగ: వరదయ్యపాలెం మండలం, బుచ్చినాయుడు కండ్రిగ రూరల్, సత్యవేడు రూరల్ మండలాల ప్రజల సౌకర్యార్థం బిఎస్ఎన్ఎల్ సిమ్‌కార్డ్ వినియోగదారుల సౌకర్యార్థం బిఎస్ఎన్ఎల్ ఫ్రీ సిమ్ మేళా శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు బిఎస్ఎన్ఎల్ అధికారి వీర రాఘవులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ 3జి సిమ్ నుండి 4జి సిమ్‌కు మారడానికి, బిఎస్ఎన్ఎల్ కొత్త సిమ్‌లు తీసుకోవడానికి, ఇతర నెట్‌వర్కుల నుండి బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు మారడానికి పరిసర ప్రజల సౌకర్యార్థం మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరదయ్యపాలెం లో పోస్ట్ ఆఫీస్ పక్కన బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద, బుచ్చినాయుడు కండ్రిగ ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఈ మేళా నిర్వహిస్తామని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిఎస్ఎన్ఎల్ అధికారులు కోరారు.

మహబూబ్ బాషా జనసేనలో చేరిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట మేజర్ పంచాయ తీ ఐదవ వార్డు సభ్యులు, వైసిపి సీనియర్ నేత పురిమిల్ల మహబూబ్ బాషా బుధవారం జనసేనలో చేరారు. ఆయనకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోటా స్థానిక జనసేన కార్యాలయంలో కండువా కప్పి ఆహ్వానించారు. న్యాయవాది వృత్తితో పాటు, నూర్ బాషా సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఉన్న మహబూబ్ బాషా జనసేనలో చేరడం ఆనందంగా ఉందని వినుత అన్నారు. పార్టీ కోసం కష్టించి పనిచేయాలని, అందుకు తగ్గ గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగరం భాస్కర్ బాబు, పట్టణ అధ్యక్షులు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వైసిపి నాయకులకు పరామర్శ

ప్రజాశక్తి - వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాల్టీ, రూరల్ పరిధిలో పలువురు వైసిపి నాయకులను తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి గురువారం పరామర్శిం చారు. వెంకటగిరి రూరల్ మండలం జంగాలపల్లి పంచాయతీ సర్పంచ్ పాలూరు ప్రమీల భర్త పాలూరు మనోహర్ అనారోగ్యం గురించి బాధపడుతుండంతో తెలుసుకున్న నేదురుమల్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఇటీవల మృతి చెందిన సీనియర్ వైసిపి నాయకుడు, మాజీ ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ , చెలికం శంకర్ రెడ్డి ఉత్తర క్రియల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. వెంకటగిరి రూరల్ మండలం మొగలుగుంటలో ఇటీవల మృతి చెందిన విశ్రాంత విఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసిపి నాయకులు పులి ప్రసాదరెడ్డి , మాజీ వెంకటగిరి ఏఎంసీ ఛైర్మన్ వెందోటి మధుసూదన్ రెడ్డి, చింతల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శాంతిపురం: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి సుమారు 7గంటల సమ యంలో కుప్పం-పలమనేరు రహదారిలోని గుండిశెట్టిపల్లి వద్ద వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. కుప్పం-పలమనేరు రహదారిలోని గుండిశెట్టిపల్లి వద్ద కుప్పం వైపు నుంచి వీకోట వెళుతున్న రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొంది. గాయపడిన క్షతగాత్రుడిని కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మరణించారు. అతని వయస్సు సుమారు 45-50మధ్యలో ఉంటుందని అతని వివరాలు తెలిసిన వారు రాళ్ళబుదగూరు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఘర్షణ కేసులో వ్యక్తికి జైలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఘర్షణ కేసులో వ్యక్తికి జైలు శిక్ష పడ్డట్టు సీఐ లక్ష్మయ్య తెలిపారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు 2020 సంవత్సరంలో మండలంలోని వెలుతురు చేను పంచాయతీ సిజిఎఫ్ కాలనీకి చెందిన గోవిందస్వామి (70) సంవత్సరములు అతని కొడుకు, కోడలు, అల్లుడుతో ఘర్షణలు పడి తన వద్ద ఉంచుకున్న తుపాకీతో దాడి చేయడంపై అప్పట్లో కేసు నమోదు చేసి విచారించడం జరిగిందన్నారు. గురువారం ఏఏజే కోర్టు జడ్జి వెన్నెల ఇచ్చిన తీర్పు మేరకు అతడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష రూ.15వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఏపీపీ స్వాతి రెడ్డి పోలీసులు ఫిర్యాదుదారులపై ఇచ్చిన సమాచారం మేరకు కేసును కోర్టులో వాదిచ్చి ఫిర్యాదుదారులకు తగు న్యాయం చేశారని ఇందుకు కోర్టు కానిస్టేబుల్ సురేంద్ర సమయంలో సాక్షులను కోర్టుకు హాజరు పరచడం పట్ల అతనికి శిక్ష పడిందని తెలిపారు.

బాలికల వసతి గృహాల అభివృద్ధికి పెద్ద పీట: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎస్సి బాలికల వసతి గృహాల అభివృద్ధికి పెద్ద పీట వేయ నున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి ఆయన తొట్టంబేడు ఎస్సీ బాలికల నెం.1, 2 వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గదులకు సరైన తలుపులు లేకపోవడం, ఫ్యాన్లు తిరగకపోవడానికి చూసి విచారం వ్యక్తం చేశారు. వెంటనే బాలికల వసతి గృహాలకు తక్షణ మౌలిక అవసరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మరో రెండు నెలల్లో వసతి గృహాల రూపురేఖలు మారుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చెంచయ్య నాయుడు, సుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ పాత టెండర్ రద్దు

కొత్త టెండర్ దక్కించుకున్న గీత

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో పాత మున్సిపాల్టీ కార్యాలయానికి సమీపంలో ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ పాత టెండర్ రద్దు అయింది. కొత్తగా వై గీత కొత్త టెండర్ చేజిక్కించుకుంది. ఈ టెండర్ రావడానికి టిడిపి నేత, ఏపీ యాదవ మహాసభ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి శంకర్ యాదవ్ కీలకపాత్ర వహించారు. అంతే కాకుండా ప్రియదర్శిని మార్కెట్‌కు వచ్చే ప్రజలకు, వినియోగదారులకు, షాపు యజమానులకు శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో తాగునీటి సదుపాయం కల్పించారు. ఈ కొత్త టెండర్ రావడం, శంకర్ యాదవ్ తాగునీటి సదుపాయం కల్పించిన నేపథ్యంలో గురువారం కూరగాయలు మార్కెట్లో తాగునీటి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుగుణమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కూరగాయల మార్కెట్లో వచ్చే ప్రజలకు ప్రతి ఒక్కరికి తాగడానికి గుక్కెడు మంచినీరు ఇవ్వకపోగా, వినియోగదారులను, షాపు యజమానులను ముప్ప తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించారని బాధపడ్డారు. కొత్త టెండర్ రావడానికి మార్కెట్లో తాగునీటి సదుపాయాన్ని కల్పించిన టిడిపి నేత, ఏపీ యాదవ మహాసభ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి శంకర్ యాదవ్ ను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా శంకర్ యాదవును తెలుగుతమ్ముళ్లు, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలు, మహిళలు, శంకర్ యాదవ్ సేన నగర ప్రజలు మార్కెట్ లోని షాపు యజమానులు, వినియోగదారులు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శంకర్ యాదవ్ ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్, టీటీడీ మాజీ బోర్డు సభ్యులు చిన్నంగారి రమణ, టిడిపి నేతలు అన్నా రామచంద్రయ్య యాదవ్, 48 వ వార్డు కార్పొరేటర్ అనిత యాదవ్ పాల్గొన్నారు.